క్లుప్తంగా

అందుబాటులో ఎరువులు

ఉప్పునుంతల: స్థానిక పీఏసీఎస్‌లో రైతులకు అందుబాటులో అన్ని రకాల ఎరువులు ఉన్నాయని పీఏసీఎస్ సీఈఓ రవీందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఏపీ 1827 బస్తాలు ఉన్నాయని ఒకటి రూ.1350లు, 20.20.0.13 కాంప్లెక్స్ ఎరువులు 3009 బస్తాలు ఒకటి రూ. 1100లు, యూరియా 779 బస్తాలు ఒకటి రూ. 267లకు విక్రయించనునట్లు పేర్కొన్నారు. 28.28.0 కాంప్లెక్స్ ఎరువులు 299 బస్తాలు వచ్చాయని ఒకటి రూ.1500లు, పొటాష్ 625 బస్తాలు రూ. 1700లకు రైతులకు విక్రయిస్తునట్లు పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉత్తమ పంచాయతీగా గుండూరు ఎంపిక

కల్వకుర్తిరూరల్: రాష్ట్రంలో 17 ఉత్తమ పంచాయతీలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందులో మండలంలోని గుండూరు పంచాయతీ ఉత్తమ అవార్డుకు ఎంపిక అయ్యింది. రాష్ట్రపతి ద్రౌపతిముర్ము చేతుల మీదుగా ఢిల్లీలో ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకునేందుకు వెళ్తునట్లు సర్పంచ్ కిష్టారెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. గ్రామంలో రూ.5 కోట్ల అభివృద్ధి పనులు చేశానని వివరించారు. ఉత్తమ పంచాయతీ ఎంపికపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

ఆర్‌ఐగా సుజాత బాధ్యతలు స్వీకరణ

ఉప్పునుంతల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా సుజాత బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కలెక్టర్ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేసి పదోన్నతిపై ఆర్‌ఐగా వచ్చారు. ఇక్కడ ఆర్‌ఐగా పనిచేసిన పద్మ బల్మూరు మండలానికి బదిలీపై వెళ్లారు.

రికార్డుల పరిశీలన



చారకొండ: పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు సగ్రమ వివరాలు నమోదు చేయాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండలంలోని చంద్రాయన్‌పల్లి, గోకారం గ్రామాల్లో పంచాయతీ కార్యాలయంలో ఆమె రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ సంబంధిత ట్యాక్సీ రికార్డు, వివాహ నమోదు తదితర రికార్డుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామాల్లో నర్సరీలో మొక్కల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న నర్సరీ బెడ్స్, వాటికి ఉపయోగించే మట్టి తదితర వాటిపై పరిశీలించారు. ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీపని, చెన్నకేశవ తదితరులు ఉన్నారు.

రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు



కల్వకుర్తిరూరల్: మండలంలోని ఎల్లికల్, కుర్మిద్ద, పంజుగూల తండాలలో రోడ్ల నిర్మాణాలకు రూ.8.70 కోట్ల నిధులు మంజూరయ్యాయని మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లకు మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్‌తో కలిసి ఆయన నిధుల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జంగయ్య, అంజియాదవ్, కృష్ణయ్య, రమేష్, నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

22న యూత్ కాంగ్రెస్ బహిరంగ సభ

కొల్లాపూర్ : పట్టణంలో ఈ నెల 22న నిర్వహించే యూత్ కాంగ్రెస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ మోహన్ కోరారు. బుధవారం పట్టణంలోని ఎస్‌ఎం ఫంక్షన్‌హాల్‌లో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొడిదెల రాము, ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి బాలకృష్ణ, కాటం మౌలాలి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాము యాదవ్ పాల్గొన్నారు.

ఎంపీటీసీకి నివాళి

బల్మూర్: మండలంలోని కొండనాగుల-2 ఎంపీటీసీ సభ్యురాలు పద్మావతి దశదిన కర్మలో బుధవారం ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. అదేవిధంగా తుమ్మెన్‌పేట ఎంపీటీసీ సురేందర్‌రావు తండ్రి దశదినకర్మలో ఎమ్మెల్యే పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

మండలంలోని చెన్నారంలో కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ సర్పంచ్ వెంకటనర్సయ్యతో పాటు యువకులు, గ్రామస్తులు 100 మంది ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంతో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ లక్ష్మి, మాజీ ఎంపీపీ కరుణాకర్‌రావు, చుక్కారెడ్డి, తిరుపతయ్య, నర్సయ్య, వెంకటేశ్వర్లు, మల్లేష్, ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఫ్లెక్సీల తొలగింపు



పెంట్లవెల్లిలో..



వెల్దండ మండలం బైరాపూర్‌లో..



అచ్చంపేట మున్సిపల్ కార్యాలయం ఆవరణలో తొలగించిన ఫ్లెక్సీలు

కొల్లాపూర్(పెంట్లవెల్లి): ఎవరైనా ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జమీల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో, పలు గ్రామాలలో ఎస్‌ఐ సురేష్, ఎంపీడీఓ రామయ్యలతో కలిసి ఆయన పర్యటించారు. పోస్టర్లను, బ్యానర్లను తీసివేయించారు. విగ్రహాలకు ముసుగులు కప్పారు.

అచ్చంపేట రూరల్: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పట్టణంలోని ప్రధాన రహదారి వెంట, వివిధ కూడళ్లలో ఉన్న ఫ్లెక్సీలను, జెండాలను బుధవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. గోడలపై ఉన్న రాతలు, పార్టీ గుర్తులను చెరిపివేశారు. నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు.

వెల్దండ: ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎంసీసీ అధికారులు రేవంత్‌రెడ్డి, సునీతలు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బైరాపూర్, కంటోనిపల్లి, చెదురుపల్లి తదితర గ్రామాల్లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా గోడలపై పార్టీలకు సంబంధించిన పేర్లు చెరిపేశారు. పార్టీ జెండాలకు ముసుగు కప్పారు. వారి వెంట సర్పంచ్ దార్ల కుమార్, ఉపసర్పంచ్ రమేష్‌గౌడ్, కార్యదర్శి లక్ష్మి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కల్వకుర్తిరూరల్/టౌన్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన సరోజ అనారోగ్యంతో బాధపడుతోంది. బుధవారం బాధిత మహిళకు మిత్ర ఫౌండేషన్ సభ్యులు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మిత్రఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, నరేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా

కల్వకుర్తిరూరల్: పేదలకు అండగా ఉంటానని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని తురుకలపల్లి గ్రామానికి చెందిన పేద వృద్ధురాలు బాలమ్మకు ఆయన ఇల్లు నిర్మించి తోడ్పాటు అందించారు. ఈ మేరకు ఆయన బుధవారం వృద్ధురాలు ఇంటిని ప్రారంభించారు. పేద మహిళను ఆదుకున్న రాఘవేందర్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట పవన్‌కుమార్‌రెడ్డి, అనీల్‌గౌడ్, విజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వంట కార్మికుల సమ్మె విరమణ



తెలకపల్లి: సమస్యలు పరిష్కరించాలని 13 రోజులుగా సమ్మె చేసిన మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె విరమిస్తునట్లు బుధవారం తహసీల్దార్ మురళీమోహన్, ఎమ్మార్సీ కార్యాలయం అధికారి రాజవర్ధన్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గోపస్ లక్ష్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ హామీ మేరకు వంట కార్మికులుఉ సమ్మెను విరమించి విధుల్లో చేరారని పేర్కొన్నారు. గీతారాణి, కార్యదర్శి ప్రశాంతి, కోశాధికారి పుష్ప, కార్మికులు పాల్గొన్నారు.

పథకాల పేరుతో మోసం



మన్ననూర్: పథకాల పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలను మభ్యపెడుతోందని కాంగ్రెస్ మండల కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం, ఎంపీటీసీ శ్రీనివాసులు విమర్శించారు. బుధవారం మన్ననూర్‌లోని ఓం చౌరస్తాలో వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. అమలుకు సాధ్యం కాని దళిత, మైనార్టీ, బీసీబంధు, గృహలక్ష్మి పథకాల పేరుతో బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారన్నారు. ఎన్ని కుయుక్తులు చేసిన అచ్చంపేటలో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వంశీకృష్ణ గెలుపు ఖాయమని దీమా వ్యక్తం చేశారు. నాయకులు వెంకటయ్య, శివాజీ, గెలువయ్య, రెహమాన్ పాల్గొన్నారు.

సోనియా గాంధీ రుణం తీర్చుకుందాం



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అచ్చంపేట రూరల్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకుందామని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీపీ తిప్పర్తి అరుణ నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ అమరావతి సీఎం రెడ్డి, జెడ్పీటీసీలు అనంత ప్రతాప్‌రెడ్డి, మంత్రియానాయక్‌తో పాటు పలువురితో కలిసి అచ్చంపేట భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని హాజీపూర్ చౌరస్తా నుంచి సుమారు వెయ్యి బైక్‌లతో ర్యాలీగా అచ్చంపేటకు చేరుకుని అంబేడ్కర్ చౌరస్తా చేరుకొన్నారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడారు. తెలంగాణ ఇస్తే కాంగ్రెస్‌లో పార్టీని విలీనం చేస్తానని, దళిత సీఎంను చేస్తానని మాట ఇచ్చి సీఎం కేసీఆర్ నిలబెట్టుకోలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే బాలరాజు రౌడీయిజం, గుండాయిజం, భూకబ్జాలు చేస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, నాయకులు అనంతరెడ్డి, సీఎం రెడ్డి, నర్సింహారెడ్డి, మాధవరెడ్డి, రఘుపతి రెడ్డి, శేఖర్, శ్రీనివాసరాథోడ్, రామనాథం, మహబూబ్‌అలీ, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపార్టీ అచ్చంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా రాములు

అచ్చంపేట రూరల్: ప్రజాపార్టీ అచ్చంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండపల్లి రాములును ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌కుమార్‌యాదవ్ బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ప్రజాపార్టీ అన్ని సామాజిక వర్గాల వారికి సీట్లు కేటాయించిందన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



అమ్రాబాద్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని డివిజన్ ఉప మలేరియాధికారి అశోక్ ప్రసాద్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కొల్లం, కొమ్మెనపెంటల్లో దోమల నివారణ మందును పిచికారి చేశారు. అనంతరం ఆరోగ్య సూత్రాలపై చెంచులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అశోక్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం దోమలు కుట్టడం అనేక మలేరియా, డెంగీ వ్యాధి సోకుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీను, సులోచనలక్ష్మణ్, భారతి, శ్రీరాములు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థికి సన్మానం

కొల్లాపూర్(పెంట్లవెల్లి): మండలంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 2014-15 ఎస్‌ఎస్‌సీ పూర్తి చేసిన ఎంగంపల్లి తండాకు చెందిన లోకేష్‌నాయక్ కానిస్టేబుల్ ఫలితాలలో 129 మార్కులతో ప్రతిభ కనబర్చి కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ఈమేరకు బుధవారం పాఠశాలలో గురువులు అర్జున్‌గౌడ్, నర్సింహ పూర్వ విద్యార్థి లోకేష్‌నాయక్‌ను సన్మానించారు.

నేడు డయల్ యువర్ డీఎం

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ఆర్టీసీ డిపో పరిధిలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. సెల్: 9959226292 నంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్

బిజినేపల్లి: కాంగ్రెస్ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలానికి చెందిన కారుకొండ శ్రీనివాస్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం డీసీసీ జిల్లా అధ్యక్షుడు డా.వంశీకృష్ణ నియామక పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కూచుకుళ్ల సుహాసన్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, అజీజ్ తదితరులు శ్రీనివాస్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయొద్దు



తెలకపల్లి: పేదలక ఎంతో ఆసరాగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయొద్దని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలోని ఉద్యోగి వెంకటప్పకు వ్యకాస నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం ప్రభుత్వం రద్దు చేసేందుకు యత్నిస్తుందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చింత ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా నాయకులు గోపస్ లక్ష్మన్, నందిపేట భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల ఆక్యుపెన్సీ పెంచుదాం

కల్వకుర్తిరూరల్: ఆర్టీసీ బస్సుల ఆక్యుపెన్సీ పెంచుదామని కల్వకుర్తి డిపో మేనేజర్ శ్రీకాంత్ కోరారు. బుధవారం మండలంలోని బెక్కెర, వేపూరు గ్రామాలలో బస్సు సౌకర్యంపై గ్రామస్తులతో మాట్లాడారు. ఉదయం 5.30 నిమిషాలకు గుడిగానిపల్లి నుంచి బస్సు ప్రారంభమవుతుందని మాధారం, ఎల్లికట్ట, తోటపల్లి మీదుగా హైదరాబాద్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన లక్కీ డ్రా విజేతకు రూ.11 లక్షల బహుమతి అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో రాజాగోపాల్, శివజగదీశ్వర్, గఫార్ పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



లింగాల మండలం అంబట్‌పల్లి పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థినులు

కందనూలు: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రిన్సిపాల్ ఎస్ అనసూయ, నాగర్ కర్నూల్ సీఐ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ బాలికా దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్- 1 ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు షహజాది బేగం, వై లింగయ్య, జి శ్రీనివాసులు, ఇక్బాల్, స్వర్ణలత, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బల్మూర్: మండల కేంద్రంలో కోనేర్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని కేజీబీవీ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, సర్పంచ్ శివశంకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, సంస్థ ప్రతినిధులు ఖయ్యూం, లలిత పాల్గొన్నారు.

కొల్లాపూర్(పెంట్లవెల్లి): మండల కేంద్రమైన పెంట్లవెల్లిలో జెడ్పీహెచ్‌ఎస్ బాలుర హైస్కూల్‌లో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బలరాంకృష్ణారావు మాట్లాడుతూ బాల్యవివాహాలు అరికడదామని కోరారు. అనంతరం విద్యార్థులతో, ఉపాధ్యాయులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు.

అమ్రాబాద్: బాలికలు అన్నిరంగాలలో రాణించాలని ఎస్‌ఐ వీరబాబు అన్నారు. కోనేరు సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శివశంకర్, ఆంజనేయులు, కోనేరు సంస్థ కోఆర్డినేటర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం గ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా ఎస్వీకే సీడబ్ల్యూసీ చైర్మన్ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాలలో రాణించి సమాజంలో ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తాహెర్‌పాషా, ఎస్వీకే ఎంసీఓ మన్సూర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు ఖాయం



కందనూలు: వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఇన్‌చార్జ్ దిలీప్ ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. రోజురోజుకు ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి నల్లమట్టి దొంగగా పేరుగాంచారని ఎద్దేవా చేశారు. పదేళ్లలో ఎమ్మెల్యే దౌర్జన్యాలు, అక్రమాలు పాల్పడ్డారని విమర్శించారు. అడ్డొస్తే కాల్చేస్తా, అణగదొక్కుతా అంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వివరించారు. నాగర్ కర్నూల్ కాంగ్రెస్ పార్టీ టికెట్ రూ.12 కోట్లకు అమ్ముడుపోయిందని ఆరోపించారు. సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి, దోమ తిరుపతిరెడ్డి, నాగర్‌కర్నూల్ టౌన్ జనరల్ సెక్రెటరీ ప్రమోద్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నారాయణ చారి, మండల అధ్యక్షుడు భూషయ్య, బచ్చిరెడ్డి, యశ్వంత్, లోహిత్ రెడ్డి, నరేంద్ర చారి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్ రెడ్డి జిల్లా అధికార ప్రతినిధి శ్రీశైలం, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బొట్టు శీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం: రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ విష్ణు వర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉండటంతో రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించకూడదన్నారు. ఎన్నికల్లో మద్యం, డబ్బుతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా గన్స్ కలిగి ఉంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని తెలియజేశారు. పోలీస్‌స్టేషన్ల వారీగా రౌడీషీటర్లను బైండోవర్ చేశామని, ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఐ మహేందర్ పాల్గొన్నారు.

కొల్లాపూర్(పెద్దకొత్తపల్లి): శాసనసభ ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ యూసుఫ్‌అలీ, ఎస్‌ఐ రాజు అన్నారు. పెద్దకొత్తపల్లి పోలీసు స్టేషన్‌లో బుధవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించొద్దన్నారు. నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జిల్లా ఆవిర్భావ సంబరాలు



తెలకపల్లి: మండల కేంద్రలోని ప్రధాన కూడలిలో నాగర్‌కర్నూల్ జిల్లా 8వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు పటాకులు కాల్చి కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఎంపీటీసీ సభ్యులు రెడ్డపాకుల రమేష్, లక్ష్మమ్మ, విజయలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి కోట్ల శ్రీనివాసులు, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, నర్సింహ, రాములు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నియంత పాలన నుంచి విముక్తి కల్పిస్తాం



తాడూరు: సీఎం కేసీఆర్ నియంత పాలన నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తామని కాంగ్రెస్ నాయకుడు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఎట్టిదారిపల్లిలో ఆయన పర్యటించారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై వేధించి కేసులు నమోదు చేయించి ఎన్నో ఇబ్బందులకు గురిచేశారన్నారు. ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటా తిరిగి కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రోహిణి, సింగిల్ విండో డైరెక్టర్ లక్ష్మి, యుగేందర్‌రెడ్డి, మల్లయ్య, కోటేశ్వర్, గోవర్ధన్‌రెడ్డి, ఆయా గ్రామాల, మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి



నాగర్‌కర్నూల్ క్రైం: ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి అని ట్రాఫిక్ ఎస్‌ఐ కల్యాణ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు ఎక్కడ పడితే అక్కడ ఆటోలను పార్కింగ్ చేస్తే ఫైన్ విధిస్తామని, యూనిఫాం తప్పనిసరిగా ధరించాలన్నారు.కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల అందజేత



తాడూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాలు క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఆ సంస్థ అధ్యక్షుడు రాఘవేందర్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీపరీక్షలకు పుస్తకాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనీల్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్, నరేందర్ బాబు, విద్యార్థుల పాల్గొన్నారు.

15 నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు



కందనూలు: జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణలో ఈనెల 15 నుంచి 9 రోజుల పాటు నిర్వహించే దేవీ నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మిడిదొడ్డి శ్యాంసుందర్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కన్యకపరమేశ్వరి దేవాలయంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన కార్యక్రమ వివరాల పుస్తకాన్ని, పట్టు వస్త్రాలు, పూజా కార్యక్రమాల సామగ్రిని ప్రారంభించి పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వాస ఈశ్వరయ్య, ఆకుతోట మధుమోహన్, బిల్లా కంటి రవి కుమార్, హరిబాబు, ఆకారపు విశ్వనాథం, కోట్ర బలరాముడు, ఎలిమే ఈశ్వరయ్య, మిడిదొడ్డి చంద్రశేఖర్, చిగుళ్లపల్లి రమణ, బాదం నరేందర్, భరత్, హకీమ్ కిషోర్, బాదం పరమేశ్వర్, కంచర్ల శ్యాంసుందర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

కల్వకుర్తి: పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్న నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు బుధవారం క్యాంపు కార్యాలయంలో దేవాలయ చైర్మన్ జూలూరి రమేష్‌బాబు ఆహ్వానించారు. కార్యక్రమంలో అశోక్, రాఘవేందర్, శ్రీనివాస్, వెంకటేష్, రాజేందర్, రామస్వామి, శ్రీనివాస్, విజయ్‌కుమార్, రవి, బాలకృష్ణ పలువురు పాల్గొన్నారు.

సారా పట్టివేత: కేసు నమోదు

తెలకపల్లి: మండలంలోని శివరాంతండాకు చెందిన ముడావత్ బుజ్జి నివాసంలో పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వసిరాంనాయక్ పేర్కొన్నారు.

అచ్చంపేట రూరల్: మండలంలోని బుడ్డతండాలో బుధవారం పోలీసులు దాడులు నిర్వహించి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



తెలకపల్లి: కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని యోగా భవనంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజు మాట్లాడుతూ నాగర్ కర్నూల్ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొత్తపల్లికుమార్‌ను ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామన్నారు. సృజన, నాయకులు హర్ష, సుభాష్, కళ్యాణ్, మండల అధ్యక్షుడు ఆర్ శివశంకర్, మల్లేష్, బాలనాగయ్య, సుల్తాన్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.